సైకిల్‌తో వ్యాయామం.. ఆరోగ్యకరం



తాడిమర్రిలో విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



బుక్కపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ఎన్పీ కుంటలో ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు

తాడిమర్రి: ప్రతి రోజూ సైకిల్ తొక్కడంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని సీహెచ్‌ఓ హేమలత పేర్కొన్నారు. క్యాన్సర్ డే పురస్కరించుకుని వైద్య సిబ్బందితో కలసి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మంగళవారం ఆమె సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల సమావేశంలో మాట్లాడారు. ద్విచక్రవాహనాలు, కార్లకు స్వస్తి పలికి సైకిళ్ల వైపు మొగ్గు చూపాలన్నారు. రోజూ సైకిల్ తొక్కితే రక్త ప్రసరణ చక్కగా జరుగుతుందన్నారు. కండరాలు, ఎముకలు బలిష్టమై రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓలు మనోహర్ బాబు, నారాయణస్వామి, సూపర్‌వైజర్ రామ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ తొక్కితే రుగ్మతలు దూరం

బత్తలపల్లి: అనేక రుగ్మతల నుంచి బయటపడాలంటే సైకిల్ తొక్కడం సరైన మార్గమని ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ లిఖిత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మెగా సైక్లోథోన్ ర్యాలీని ఆస్పత్రి నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు విద్యార్థులతో కలిసి నిర్వహించారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ సైకిల్ తొక్కడం వలన క్యాన్సర్ బారిన పడకుండా రక్షించుకోవచ్చన్నారు. అధిక బరువు తగ్గించుకోవచ్చన్నారు. రక్తపోటు నియంత్రణలో ఉంచుకోవచ్చునన్నారు. సీహెచ్‌ఓ రాజశేఖర్, పర్యవేక్షక సిబ్బంది చంద్రశేఖర్‌రెడ్డి, గౌరమ్మ, నారమ్మ, హెల్త్ అసిస్టెంట్‌లు రవి, తిరుపాలు తదితరులున్నారు.

ముదిగుబ్బలో..

ముదిగుబ్బ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ రాజేంద్ర ఆధ్వర్యంలో హెల్త్ మేళ నిర్వహించారు. సైకిల్ ర్యాలీ చేపట్టారు. వైద్య సిబ్బంది సరస్వతమ్మ, నాగరత్నమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

ధర్మవరం రూరల్: ప్రతి రోజూ వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ దిలీప్ కుమార్ అన్నారు. మంగళవారం డాక్టర్‌ఆధ్వర్యంలో హెల్త్ మేళా చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం, గుట్కాతో ప్రాణహాని

పుట్టపర్తి: మద్యం, గుట్కా లాంటివి తీసుకుంటే ప్రాణహాని తప్పదని వైద్య సిబ్బంది తెలిపారు. మంగళవారం బుక్కపట్నం ఆస్పత్రి నుంచి తేరు కూడలి వరకు విద్యార్థులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. మత్తు పదార్థాలు తీసుకుంటే ప్రాణాంతక క్యాన్సర్ బారిన పడాల్సి వస్తుందన్నారు. రోజూ 10 నిముషాలు సైకిల్ తొక్కితే గంట సేపు వ్యాయామం చేసినట్టేనని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సాంబశివమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ రామమోహన్ చౌదరి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో రోగాలకు చెక్

ఎన్పీకుంట: వ్యాయామంతో రోగాలకు చెక్ పెట్టవచ్చని వైద్యాధికారులు సూచించారు. మంగళవారం మండలంలోని పెడబల్లి ఆరోగ్య ఉపకేంద్రంలో పీహెచ్‌ఎన్ శాంతమ్మ ఆధ్వర్యంలో మెగా హెల్త్ మేళా నిర్వహించారు. సైకిల్‌తో వ్యాయామం–ఆరోగ్యంతో సహవాసం అనే కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. ప్రతి రోజూ వ్యాయామం చేస్తే ఏ వ్యాధి దరిచేరదని సూచించారు. 104 వాహనం ద్వారా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి రక్త, బీపీ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ రవి శంకర్, ఆరోగ్య కార్యకర్త రమేష్‌రెడ్డి, సీహెచ్‌ఓ నాగప్రభ, ఏఎన్‌ఎం లక్ష్మీదేవి, ఆశాలు పాల్గొన్నారు.

కేన్సర్ వ్యాధిపై అవగాహన

చెన్నేకొత్తపల్లి: మండలపరిధిలోని కనుముక్కలలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కేన్సర్ వ్యాధిపై మంగళవారం అవగాహన ర్యాలీ చేశారు. కేన్సర్ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓ సౌందర్య మాట్లాడుతూ కేన్సర్ బాధితులు ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సానే రమాదేవి, హెచ్‌ఎం పార్వతి, ఎంపీహెచ్ఏ శ్రీనివాసులు, ఆశావర్కర్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మెటీరియల్ పంపిణీ

ఓడీ చెరువు: మండలంలోని మిట్టపల్లి బీసీ వసతి గృహం పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ఏబీసీడబ్ల్యూఓ గంగాద్రి, హెచ్‌డబ్ల్యూఓ శంకర్ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. వసతి గృహంలో విద్యార్థులకు వసతి, భోజన సదుపాయంతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించేందుకు మెటీరియల్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీరాములు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు ఫేస్ యాప్ తొలగించాలి

పుట్టపర్తి టౌన్: వీఆర్‌ఏలకు ఫేస్ యాప్ తొలగించి, కనీస వేతనం రూ. 26 వేలకు పెంచాలని ఏపీ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న డిమాండ్ చేశారు. మంగళవారం పుట్టపర్తిలోని శిల్పారామంలో నిరసన తెలియజేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌ఓ కొండయ్యకు వినతిపత్రం అందజేశారు. డీఏ రూ. 300 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ గ్రామ రెవిన్యూ సహాకుల సంఘం జిల్లా నాయకులు ప్రసాద్, గంగాద్రి, నాగరాజు, ఓబుళప్ప, లింగప్ప, నాగప్ప, చిన్నయ్య, పెద్దన్న, నరసప్ప, కృష్ణ, నరశింహులు, చంద్రమోహన్, లక్ష్మి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరామర్శ



పుట్టపర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌ను ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పరామర్శించారు. మంగళవారం విజయవాడలో రఘురామ్, ఆయన కుటుంబ సభ్యులను కలిసి సంతాపం తెలిపారు. ఆయన సతీమణి స్వర్ణకుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేతో పాటు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి, తదితరులున్నారు.

'వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలి'



ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్‌లు

ధర్మవరం అర్బన్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని రిటైర్డ్ లెక్చరర్ కొండారెడ్డి, ధర్మవరం నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ చింతకాయల నరేష్, హరినాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం పట్టభద్ర ఓటర్లను కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రవీంద్రరెడ్డిని గెలిపించాలని కోరారు.

వెన్నపూసను గెలిపించుకుందాం

రామగిరి: ఉన్నత విద్యావంతుడు, న్యాయవాది అయిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని జెడ్పీటీసీ గోసే నాగార్జున కోరారు. మంగళవారం మండలంలోని కుంటిమద్ది, పేరూరు, రామగిరి, ఎంసీపల్లి, నసనకోట, మాదాపురం, పోలేపల్లి, గంతిమర్రి, పెద్దకొండాపురం పంచాయతీల్లోని గ్రామాల్లో వారు పర్యటించారు. కార్యక్రమంలో మండల అగ్రిబోర్డు చైర్మన్ నరసింహా రెడ్డి, పేరూరు, కుంటిమద్ది సర్పంచ్‌లు రాజేష్, నరేంద్ర, నాయకులు వెంకటరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రవీంద్రారెడ్డి, గొని ఆనంద్, పల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్దమ్మ రథోత్సవం

పుట్టపర్తి: బుక్కపట్నం బైపాస్ దిగువన ఉన్న ఎస్సీ కాలనీవాసుల ఆధ్వర్యంలో మంగళవారం పెద్దమ్మ దేవత రథోత్సవం వైభవంగా జరిగింది. కాలనీ వాసులు శివకుమార్,యశోద,రాయుడు తదితరులు పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద పెద్దమ్మ దేవతకు పూజలు చేసుకునే భాగ్యం కల్పించారు.

కునుకుంట్లలో 'ఫ్యామిలీ ఫిజీషియన్'

తాడిమర్రి: మండలంలోని కునుకుంట్ల గ్రామంలో మంగళవారం వైద్య సిబ్బంది ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీహెచ్‌ఓ నారాయణస్వామి, ఎంఎల్‌హెచ్‌ఎస్ విజయ తదితర వైద్య సిబ్బంది గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు బీపీ, షుగర్, రక్త, మూత్ర పరీక్షలు చేశారు. అనంతరం ఇంటింటా తిరుగుతూ వివిధ రోగాలతో మంచం పట్టిన రోగులకు వైద్య చికిత్సలు అందించారు. మందులు పంపిణీ చేశారు.

సర్వేతో భూములకు రక్ష

బత్తలపల్లి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా చేపడుతున్న రీసర్వేతో యజమానులకు అన్ని హక్కులపై మరింత భరోసా లభిస్తుందని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సునీత పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గుమ్మల్లకుంట, అప్పరాచెరువు గ్రామాల్లో తహసీల్దార్ యుగేశ్వరిదేవి ఆదేశాల మేరకు భూ రీసర్వేపై గ్రామ సభలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గతంలో బ్రిటీష్ ప్రభుత్వంలో సర్వే చేశారని, తిరిగి ఇప్పుడు ప్రభుత్వం చేపడుతోందన్నారు. వీఆర్‌ఓ రవికాంత్‌రెడ్డి, సర్వేయర్లు కల్పన, ఆశాజ్యోతి, వేదవతి ఉన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపిక

ధర్మవరం అర్బన్: పుట్టపర్తిలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ కార్యక్రమంలో స్థానిక బీఎస్‌ఆర్ మున్సిపల్ పాఠశాల విద్యార్థి గౌరీనారాయణ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ పోటీలకు ఎంపికై నట్లు బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాంప్రసాద్ తెలిపారు. స్థానిక పాఠశాలలో మంగళవారం విద్యార్థిని అభినందించారు. గైడ్ టీచర్ పద్మావతమ్మ, ఉపాధ్యాయులు రాజేశ్వరి, నాగరాజు, నాగలక్ష్మి, శైలజ, హనుమంతు, విజయ్ కుమార్ విద్యార్థిని అభినందించారు.

రేపు కృష్ణదేవరాయ విగ్రహ ప్రతిష్ట

ధర్మవరం: హిందూపురంలో గురువారం శ్రీకృష్ణదేవరాయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బలిజ సంఘం నాయకులు తెలిపారు. పట్టణంలోని బలిజ కళ్యాణ మండపంలో మంగళవారం ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు తొండమాల రవి, మాసపల్లి సాయికుమార్, కొండమీద రాయుడు, గూటిపల్లి రమేష్, అచ్యుత లక్ష్మయ్య, రాజా, అమర్, మహేష్, మురళి, సుబ్బు, నరేష్, బాలు, రాజేష్, మంజు తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు న్యాయం చేసింది వైఎస్సార్ సీపీనే

- టీడీపీ హయాంలో ఈ రంగం నిర్వీర్యం
- వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం నాయకులు, కౌన్సిలర్లు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ చేనేత విభాగం నాయకులు, కౌన్సిలర్లు

ధర్మవరం: ఇన్నేళ్లలో చేనేతలకు ఎవరైనా న్యాయం చేశారా అంటే అది ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమే అని వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం నాయకులు, కౌన్సిలర్లు స్పష్టం చేశారు. టీడీపీ హయాంలో మొత్తం చేనేత రంగాన్ని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి, పెణుజూరు నాగరాజు, వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం నాయకులు ఉడుముల రాము, కాకంగి శ్రీనివాసులు, కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి మాట్లాడుతూ టీడీపీ హయాంలో ముడిపట్టు ధరలు పెరిగితే కనీసం నెలకు రూ.600 ఇచ్చేందుకు అప్పటి సీఎం చంద్రబాబుకు చేతులు రాలేదన్నారు. ఉపాధి లేక వలసలు వెళ్తే పట్టించుకోలేదన్నారు. అప్పుల బాధతో నేతన్నలు ఆత్మహత్యకు పాల్పడితే సాయం అందించలేదన్నారు. అలాంటి మీరా చేనేతల సంక్షేమం గురించి మాట్లాడేది అని విమర్శించారు. చేనేతలకు వైఎస్సార్‌సీపీ మంచి చేసిందో, మీరు మంచి చేశారో అనే విషయాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. రాష్ట్రంలోనే ప్రథమంగా ముడిపట్టు రాయితీ పథకాన్ని 2011లో ప్రవేశపెట్టి ఠంచనుగా ప్రతి నెలా ఒక్కో చేనేత కార్మికునికి రూ.600 సాయం చేశారన్నారు. రాయితీ సాయాన్ని రూ.600 నుంచి రూ.1000కి పెంచుతామని ధర్మవరంలో చంద్రబాబు సీఎం హోదాలో హామీ ఇచ్చి తర్వాత బుట్టదాఖలు చేశారని దుయ్యబట్టారు. పెండింగ్ ముడిపట్టు రాయితీ బిల్లుల కోసం 2017లో ఎమ్మెల్యే కేతిరెడ్డి నేతృత్వంలో ధర్మవరంలో చేనేతలు 37 రోజులు మహాధర్నా చేశారని గుర్తు చేశారు. చేనేతల దీనస్థితిని చూసి ప్రతిపక్ష నేతగా చలించిపోయిన జగన్, ముఖ్యమంత్రి కాగానే నేతన్న నేస్తం పథకం ద్వారా ఒకేసారి రూ.24 వేల చొప్పున అందించి చేనేతల అభివృద్ధిలో భాగస్వాములయ్యారన్నారు. కరోనా వంటి కష్టకాలంలోనూ సాయం అందించి ఇప్పటివరకూ ఒక్కో కుటుంబానికి రూ.96 వేల లబ్ధి చేకూర్చారన్నారు. టీడీపీ హయాంలో చేనేత కార్మికులు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుంటే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి 2018లో పట్టణంలో జోలెపట్టి భిక్షాటన చేసి 37 బాధిత చేనేత కుటుంబాలకు రూ.65 వేలు అందించారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం రూ.5 లక్షలకు పెంచి అర్హులందరికీ అందించారన్నారు. కేంద్ర ప్రభుత్వం చేనేతపై జీఎస్టీ విధిస్తే టీడీపీ నాయకులు ధర్మవరంలో తూతూ మంత్రంగా నిరసన తెలిపి చేతులు దులుపుకున్నారన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి, ఎంపీలు గోరంట్ల మాధవ్, విజయసాయిరెడ్డితో ఢిల్లీలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలసి జీఎస్టీని మినహాయించాలని కోరారని గుర్తు చేశారు. వంద యూనిట్లలోపు వినియోగించే చేతిమగ్గాల వారికి ఉచిత విద్యుత్ అందిస్తున్నారన్నారు. ఇదంతా టీడీపీ నాయకుల కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డిపై బురదజల్లాలని చూస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో 40 వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

అవార్డుతో బాధ్యత పెరిగింది

- సేవారత్న అవార్డు గ్రహీత డాక్టర్ మదన్ కుమార్



డాక్టర్ మదన్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కదిరి: భారతీయ సేవా రత్న అవార్డు తనకు ఎంతో గౌరవాన్ని తెచ్చిందని, అదే క్రమంలో మరింత బాధ్యతను కూడా పెంచిందని డాక్టర్ మదన్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక రిషిత చిన్న పిల్లల ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోవిడ్ సమయంలో తాను చేసిన సేవతో పాటు కొన్నేళ్లుగా చేపట్టిన సేవా కార్యక్రమాలను గుర్తించి గ్లోబల్ స్కాలర్స్ ఫౌండేషన్ వారు అవార్డు అందజేశారని చెప్పారు. కదిరి ప్రాంతం వారికి త్వరలో ఖరీదైన లేజర్ కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తానని ప్రకటించారు. కదిరిలో మార్చి మూడో ఆదివారం నుంచి ప్రారంభించి, ప్రతి నెలా మూడో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు.

ఘన సన్మానం

భారతీయ సేవారత్న అవార్డు అందుకున్న డా.మదన్‌ను మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. కోవిడ్ సమయంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా సుమారు 10 వేల మందికి పైగా వైద్య సేవలు అందించారని, గుండె జబ్బులున్న చిన్న పిల్లలు 100 మందికి ఉచిత ఆపరేషన్‌లు చేయించారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బాహావుద్దీన్, లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి లోకేశ్వర రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

డీలర్ల డిమాండ్లు నెరవేర్చాలి

ధర్మవరం: స్టోర్ డీలర్ల డిమాండ్లను నెరవేర్చాలని జిల్లా సివిల్ సప్లయ్ డీఎంకు రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర జాయింట్ కార్యదర్శి పరంధామరెడ్డి విన్నవించారు. మంగళవారం జిల్లా సివిల్ సప్లయ్ డీఎంను కలిసి చర్చించారు. దాల్, షుగర్‌కు సంబంధించిన పూర్తి అలాట్‌మెంట్ వచ్చే నెలకు ఇవ్వాల్సిందిగా కోరారు. సంచుల విషయంపై కూడా చర్చించారు. డీఎం సానుకూలంగా స్పందించారని పరంధామరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పుట్టపర్తి మండల ప్రధాన కార్యదర్శి చిన్న, ఈసీ వెంకట్రాముడు, రాజా తదితరులు పాల్గొన్నారు.

కందికుంటా ఖబడ్దార్

- ఎమ్మెల్యే సిద్దారెడ్డిని విమర్శించే అర్హత నీకు లేదు
- వైఎస్సార్ సీపీ నేత సాధిక్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత సాధిక్, కౌన్సిలర్లు

కదిరి టౌన్: ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డిని విమర్శించే అర్హత టీడీపీ ఇన్‌చార్జ్ కందికుంట వెంకటప్రసాద్‌కు లేదని వైఎస్సార్ సీపీ నేత, మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా భర్త సాధిక్ అన్నారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. మంగళవారం కదిరి ఎమ్మెల్యే కార్యాలయంలో పలువురు కౌన్సిలర్లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలో మున్సిపల్ చైర్మన్ పదవి ఇస్తానని ఆశజూపి ముగ్గురితో కందికుంట రూ. లక్షలు వసూలు చేసిన విషయం పట్టణ ప్రజలందరికీ తెలుసన్నారు. రింగ్ రోడ్డు కోసం కొబ్బరికాయ కొట్టి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి ప్రజల నాయకుడన్నారు. చైర్మన్ పదవి కోసం ఒక్క రూపాయి కూడా తాము ఎక్కడా ఇవ్వలేదన్నారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, ఆలయ చైర్మన్లు, కార్పొరేషన్ డైరెక్టర్ల పదవుల్లో సామాజిక న్యాయం పాటించారన్నారు. అక్రమాలు చేసే సంస్కృతి టీడీపీ నాయకులకే చెల్లిందన్నారు. ఎమ్మెల్యే చొరవతోనే కదిరికి 4 అర్బన్ హెల్త్ సెంటర్లు, రూ. 2.50 కోట్ల నిధులు మంజురయ్యాయన్నారు. కదిరి ప్రభుత్వ ఆస్పత్రిలో రూ. 18 కోట్లతో భవన నిర్మాణ పనులు అద్భుతంగా జరుగుతున్నాయన్నారు. రూ. 90 లక్షలతో మున్సిపల్ కార్యాలయాన్ని సుందరంగా నిర్మించామన్నారు. రూ.150 కోట్లతో రింగ్ రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. గతంలో తాగునీటి కోసం కదిరి ప్రజలు ఇబ్బంది పడేవారని, నేడు ఆ సమస్యే ఎక్కడా లేదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఖాశీం, అహమ్మద్, రంగారెడ్డి, ఇస్మాయిల్, ఆవుల స్వామి, రాంప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పిచ్చలి శంకర్, కొలిమి జిలాన్, మార్కెట్ నౌషాద్, అల్తాఫ్, రమేష్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

'సమావేశానికి అధికారులే రాకుంటే ఎలా?'

ఎన్పీకుంట: మూడు నెలలకు ఒక సారి ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి నిర్వహించే సాధారణ సర్వసభ్య సమావేశానికి అధికారులే గైర్హాజరైతే ఎలా అంటూ ఎంపీపీ ఈటిరాము, ఎంపీడీఓ ఆదినారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరుకాని రెవెన్యూ, ఆర్టీసీ, ఆర్‌అండ్‌బీ, మైనర్ ఇరిగేషన్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులపై ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు సమస్యలు ఎవరితో చెప్పుకోవాలని ప్రశ్నించారు. గతంలో పలుమార్లు హెచ్చరించినా తీరు మారలేదన్నారు. హాజరుకాని అధికారులకు మెమోలు జారీ చేసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఎంపీడీఓ తెలిపారు. అనంతరం మండల వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం, పాఠశాల ఆవరణం అపరిశుభ్రంగా ఉందని సర్పంచ్ అంజినమ్మ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతు భరోసా కేంద్రాల్లో నాణ్యమైన ఎరువులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ కేశవరెడ్డి కోరారు. అంగన్ వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందించట్లేదని, సంబంధిత సూపర్‌వైజర్ పర్యవేక్షించాలని ధనియానిచెరువు ఎంపీటీసీ కొత్తరంగారెడ్డి కోరారు. గ్రామాల్లో సర్వేయర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పెడబల్లి ఎంపీటీసీ సరస్వతి ఫిర్యాదు చేశారు. 104 వాహనం తమ గ్రామానికి రావడం లేదని వెలిచలమల ఎంపీటీసీ సంపూర్ణ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కేశవరెడ్డి, సంపూర్ణ, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సజావుగా సర్వసభ్య సమావేశం

నల్లచెరువు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రమణారెడ్డి అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ఎంపీడీఓ శకుంతల, జెడ్పీటీసీ అనితతో పాటు అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరయ్యారు. ప్రభుత్వ పథకాలు, వాటి అమలు తీరును వివరించారు. ఎంపీపీ రమణారెడ్డి మాట్లాడుతూ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేయాలన్నారు. విద్యుత్ సమస్యలను ఏఈ వాగ్దేవి దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని కోరారు. వేసవిలో గ్రామాల్లో నీటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కదిరి అర్బన్: బాలప్పగారిపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న గణేష్ అనే యువకునికి మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్ రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేశారు. గణేష్ గొంతు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని గ్రామస్తులు హరిప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన ఆర్థికసాయం చేశారు. బత్తల యువసేన సభ్యులు బాబ్జాన్, ముబారక్, జహా, కిరణ్ తదితరులున్నారు.

సేవాలాల్ జయంత్యుత్సవం

తలుపుల: మండలంలోని గొల్లపల్లితండాలో మంగళవారం సేవాలాల్ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామం నడిబొడ్డున సేవాలాల్ చిత్రపటం ఉంచి నైవేద్యం వండి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఎకాలజీ డైరెక్టర్ సర్దానప్ప, సీఎస్‌ఏ డైరెక్టర్ ఆదినారాయణ, శ్యామలాదేవి, సేవాలాల్ సేంద్రియ వ్యవసాయ సంఘం గౌరవాధ్యక్షులు గంగాదర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

16న ఖాద్రీ ఆలయంలో సమావేశం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఈ నెల 16న ఆలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈఓ పట్టెం గురుప్రసాద్, చైర్మన్ గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు, ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు ఆర్డీఓ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి హాజరవుతారన్నారు. అధికారులు, ఉభయదారులు, పాలక మండలి సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు.

బోధనా విధానాలు అభివృద్ధి చేసుకోవాలి

తనకల్లు: ఉపాధ్యాయులు బోధనా విధానాలను అభివృద్ధి చేసుకోవాలని స్టేట్ రిసోర్స్ గ్రూప్ సభ్యులు విజయ్‌కుమార్, జాఫర్ హుస్సేన్, నాగేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని సీజీ ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన గిరిజన బాలికల గురుకుల పాఠశాల, కస్తూరిబా పాఠశాలలను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేట్ రిసోర్స్ గ్రూప్ సభ్యులు మాట్లాడుతూ 6,7,8వ తరగతులకు అన్ని సబ్జెక్టులకు బేస్‌లైన్ టెస్టులను నిర్వహించాలన్నారు. లిప్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు తగినన్ని అభ్యసనాభివృద్ధి కార్యక్రమాలను ఏర్పాటు చేసి వారి అభ్యసనా నైపుణ్యాలను అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం బోధనా పద్ధతులపై ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ కంప్యూటర్ ఆపరేటర్ జానకీరామ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సంజీవయ్య జయంతి

కొత్తచెరువు: కొత్తచెరువులోని విజయనగర కాలనీలో మంగళవారం దామోదర సంజీవయ్య 102వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రామాంజినేయులు, శ్రీనివాసులు, చెనరాయుడు, నాగరాజు, మునిలక్ష్మి, నాగలక్ష్మి, తదితరులున్నారు.

అంతర్జాతీయ పుస్తక వితరణ దినోత్సవం

కొత్తచెరువు: కొత్తచెరువు జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ పుస్తక వితరణ దినోత్సవాన్ని గ్రంథాలయ అధికారి జయరాం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎంలు చెన్నక్రిష్టారెడ్డి, సుమన ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన శరత్‌కుమార్ కుటుంబ కలహాలతో వాజ్‌మోల్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు... శరత్‌కుమార్ టైల్స్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మంగళవారం సాయంత్రం భార్యతో గొడవపడి వాజ్‌మోల్ తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

కనగానపల్లి:జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ శంకర్‌లాల్ ఆదేశించారు. మండలంలో కేంద్రంలోని జగనన్న కాలనీలో మంగళవారం ఆయన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. 48 ఇళ్లు మంజూరు చేయగా, 26 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని హౌసింగ్ ఏఈ చిరంజీవి తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ షకీలా, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

నల్లమాడ: పుల్వామా ఘటనలో అమరులైన జవాన్లను స్మరించుకొంటూ స్థానిక పాత బాలాజీ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం పట్టణంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ పోలే వెంకటరెడ్డి, కరెస్పాండెంట్ పోలే స్వర్ణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

ధర్మవరం రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి దశల వారీగా చేస్తున్న పోరాటాలను జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ కన్వీనర్ బికే ముత్యాలప్ప, జిల్లా కార్యదర్శి ఎస్. రవీంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.